


హనుమంతరావు రోజూలాగానే నిద్ర లేచేసరికి సూర్యుడు ఉదయిస్తున్నాడు. మంచం ప్రక్కనే వున్న నీళ్ళ జగ్‌తో బేసిన్‌లో మొహం కడుక్కుని, దిండు సర్దుకుని, కిటికీలోంచి బయట దూరంగా కనబడే దృశ్యం చూస్తూ కూర్చున్నాడు.

సుమారుగా మైలు దూరందాకా నిలువెత్తు చెట్లు. ఆ చెట్ల అవతల కిరీటంలా కొండ పైభాగం. కొండమీద రకరకాల లతలు, పొదలు వున్నట్లు గుర్తుగా, కొండంతా ఆకుపచ్చ రంగుతో కనబడుతోంది. సూర్యకిరణాలు లేతగా పడుతున్నాయి ఆ కొండమీద.

దాదాపు ఇరవై నిముషాలదాకా అలాగే ఆ కొండవంక, దూరంగా ఎగిరే రంగురంగుల పక్షులవంక, నిశ్చలంగా నిలబడివున్న చెట్లవంక చూస్తూ కూర్చున్నాడు హనుమంతరావు. 'ఆ జలపాతం కనబడితే ఎంత బాగుణ్ణు' అనుకున్నాడు.

టి. బి. శానిటోరియంలో, మూడో అంతస్థులో, హనుమంతరావు వున్న గదిలోని టైంపీస్ అలారం మోగింది.

ఆరుగంటలయింది వుదయం. ఇప్పుడు ఎండ బాగా ప్రాకి కిటికీ లోంచి హనుమంతరావు మీద పడుతోంది. ఎండ ఇంకా లేతగానే వుంది కాబట్టి మీదపడితే హాయిగా వుంది. ఎనిమిది దాటితే ఎండ కొద్దిగా ఇబ్బంది కలిగిస్తుంది. అప్పుడు కిటికీకున్న కర్టెన్‌ని మూసేస్తుంది నర్స్‌వచ్చి. గులాబి రంగు పల్చటి నైలాన్ కర్టెన్ ఎండని వడపోస్తుంది అప్పుడు.

డాక్టర్ కోసం ఎదురుచూస్తూ హనుమంతరావు రామాయణం తెరి చాడు. కిష్కింధ కాండదాకా వచ్చాడు హనుమంతరావు. ఆ శానిటోరియంలో చేరాక. అంతకుముందు రామాయణం వినటంతప్ప ఎప్పుడూ చదవలేదు. చదువుతూంటే, 'ఎప్పుడో చదివేసి వుండాల్సింది' అనిపిస్తోంది ఇప్పుడు.

తను రామాయణం చదవటం పూర్తిచేయగలడా? పూర్తయేదాకా బ్రతకడు తను. తన వూపిరితిత్తుల్లో, శ్వాసకోసంలో మండ్రగబ్బల్లా కూర్చుంది క్షయవ్యాధి. తనని అంతం చేసికాని వదలదు. క్షయకి దయ వుండదు విషజంతువుల్లాగ.

కిటికీలోంచి ఓసారి బయటికి చూశాడు. ఎదురుగా పెద్ద కొండ. చాలాసేపు ఆ కొండవంక చూసి, 'జలపాతం కనబడితే ఎంత హాయిగా వుండేది' అనుకున్నాడు మళ్ళీ.

రామాయణం చదువుతూంటే వచ్చింది నర్స్. విష్ చేశాడు హను మంతరావు చిరునవ్వుతో. ప్రతిరోజులాగే 'రేపు వుంటానా ఇలా విష్ చేయ డానికి?' అనుకున్నాడు మనస్సులో.

"రాత్రి బాగా నిద్రపట్టిందా?" అడిగింది నర్స్.

"మామూలే" అన్నాడు హనుమంతరావు.

నర్స్ మంచం ప్రక్కనేవున్న చిన్న స్టాండ్ మీదవున్న బేసిన్ తీస్తూ చూసింది. నల్లగా గడ్డకట్టిన రక్తంవుంది దాంట్లో. తనతో తెచ్చిన కొత్తపింగాణీ బేసిన్ ఉంచింది దాంట్లో. దానిమీద ఎంత చక్కటి నగిషీ?

"ఇంకా బాలు రాలేదా?" అడిగాడు నర్స్‌ని.

"రాలేదు" నర్స్ రోజూలాగే సమాధానం చెప్పింది.

"డాక్టర్?"

"ఇంకో అరగంటలో వస్తారు."

రోజూ ఉదయం ఇలా నాలుగయిదు ప్రశ్నలు రోటీన్. తర్వాత కొత్త సంగతులు మాట్లాడుతారు.

నర్స్ హనుమంతరావు శరీరాన్ని వేడినీళ్ళతో ముంచిన తడిగుడ్డతో తుడిచి, పక్కసర్ది, మందు త్రాగించి, రెండు ఇంజెక్షన్లుచేసి వెళ్ళిపోయింది మిగతారోగులను చూడటానికి.

బాలు అరగంట తర్వాత వీపుకి కట్టుకున్న పెద్ద వెదురుబుట్టతో రావటం చూసాడు హనుమంతరావు కిటికీలోంచి. ఆ బుట్టనిండా కోడిగ్రుడ్లు. కొండ అవతల, రెండు మైళ్ళ దూరంలో వున్న చిన్నపల్లెనుంచి రోజూ వస్తాడు పదేళ్ళ బాలూ, కోడిగ్రుడ్లతో.

బాలూ వచ్చిన పావుగంటలో బ్రేక్‌ఫాస్టు వస్తుంది హనుమంతరావు గదికి. బ్రేక్‌ఫాస్టుతోపాటు బాలు కూడా వస్తాడు సర్వెంట్ వెనకాల. హనుమంతరావు బ్రేక్‌ఫాస్టు తినడం అయేదాకా కూర్చుని కబుర్లు చెప్పి వెళ్తాడు. హనుమంతరావుతో మాట్లాడేందుకు, బాలు తప్ప ఇంకెవరూ రారు. లేరు.

సర్వెంట్ వచ్చాడు. బ్రేక్‌ఫాస్టు వచ్చింది. బాలు కూడా వచ్చాడు. కార్న్‌ఫ్లేక్స్‌మీద చక్కెరచల్లి, వాటిమీదవేడివేడి పాలుపోసి వెళ్ళిపోయాడు సర్వెంట్.

కార్న్‌ఫ్లేక్స్ తింటున్న హనుమంతరావు వంక చూసాడు బాలు. దాదాపు ఏభై అయిదేళ్ళు. కొద్దిగా పెరిగిన గడ్డం. లోతుకుపోయిన కళ్ళు. వంటిమీద మాంసంలేదు ఎక్కడా. నరాలు, బొమికలు కనపడతాయి స్పష్టంగా. విపరీతమయిన దగ్గు, ఆయాసం. బ్రతికున్న శవం.

"రాత్రి ఎక్కువయిందా?" అడిగాడు బాలు ఎప్పటికన్నా ఎక్కువగా నీరసంగా కనిపిస్తున్న హనుమంతరావుని.

అవునన్నట్లుగా తలాడించి బ్రెడ్ టోస్టు తినసాగాడు హనుమంతరావు.

కొంచెం సేపాగి అడిగాడు బాలు.

"జలపాతం దగ్గరకి వెళ్ళారా? ఎవరయినా తీసుకు వెళ్ళారా మిమ్మల్ని?"

"లేదు" హనుమంతరావు సమాధానంలో బాధ గోచరించింది బాలుకి.

తప్పక చూడాలి సార్ మీరు. సరిగ్గా ఒక మైలుదూరం ఉంటుంది. చాలా ఎత్తునుంచి ఇంతలావు ధారగా పడుతుంది. ఎండమీదపడి నీళ్ళు మెరుస్తూ జారుతుంటాయి కిందకి. వర్షం వచ్చి వెలిస్తే, ఒక్కోసారి ఇంద్ర ధనుస్సు వస్తుంది. అప్పుడు బలే బావుంటుంది సార్. నీళ్ళన్నీ కలసి పెద్ద సరస్సులోకి వెళ్ళిపోతాయి రాళ్ళ మధ్యనుంచి గమ్మత్తుగా."

కళ్ళు మూసుకుని తను అనేకసార్లు విన్న ఆ జలపాతం గురించి మళ్ళీ విన్నాడు హనుమంతరావు. కళ్ళు మూసుకుని వింటూ, వూహించ డానికి ప్రయత్నించాడా సుందర దృశ్యాన్ని.

"వర్షాకాలం కాబట్టి నీళ్ళు బలే ధారగా పడుతున్నాయి సార్ ఇప్పుడు."

హనుమంతరావు కళ్ళు తెరచి ఓసారి దూరంగా కనబడుతున్న ఎత్తయిన పర్వత శిఖరంపైపు తలత్రిప్పి చూసాడు. పెద్దగా నిట్టూర్చాడు. కొద్దిగా తలపంకించాడు.

బాలు నిశ్శబ్దంగా బయటకి నడిచాడు. బాలు వెళ్ళిపోయి వుంటాడని తెలుసు హనుమంతరావుకి. ఆ కొండ వంకే చూస్తూ కూర్చున్నాడు.

తనంతదాకా జలపాతాన్ని చూడలేదు ఎక్కడా. ఓసారి ఏదో పనిమీద బెంగుళూరు వెళ్ళాడు. తనతో కూడా వచ్చిన స్నేహితుడు షిమోగా వెళ్తూ రమ్మని ఆహ్వానించాడు. వెళ్ళలేదు తను. కొండమీదనుంచి పడే నీళ్ళని చూడటానికి అంతదూరం వెళ్ళడం వృధా అనుకుని హోటల్ గదిలోనే, స్నేహితుడు తిరిగివచ్చేదాకా మత్తుగా గడిపేసాడు వైట్ హార్స్‌తో.

తను వెళ్ళి ఉండాల్సింది. అప్పుడు అనిపించలేదు చూడాలని. తన కంత ముఖ్యం అనిపించలేదా జలపాతం. జీవితంలో అసలు తనకి ప్రకృతి ఎప్పుడూ ముఖ్యం అనిపించలేదు.

చిత్రం!

బాలు ఆ జలపాతం గురించి మాటల్లో చెప్తే తనకి ఎందుకు దాన్ని చూడాలని ఇంత ఉత్సాహంగా ఉంది? బాలు వర్ణించి చెప్పిన విధంవల్లా? ఈ చుట్టుప్రక్కల చూడదగ్గవి మరేవీ లేకపోవటంవల్లా? ప్రకృతి మీద ఇంట్రెస్టు పుట్టా? లేక తన ఆఖరి రోజులనా?

హనుమంతరావు కిటికీలోంచి బయటకి చూసాడు. నీళ్ళ టేంక్‌మీద కూర్చుని ఉన్నాయి అయిదారు చిలకలు. వాటివంక చూసాడు ఆసక్తిగా. అరుస్తున్నాయి. అదేం భాషో? వాటిలో వాటికి ఆ అరుపులు అర్థమవుతాయా? అసలది భాషేనా?

నిశ్శబ్దంగా గదిలోకి వచ్చిన నర్స్‌ని గమనించలేదు హనుమంత రావు, ఫ్లవర్ వేజ్ ముందు కదలికని గ్రహించేదాకా.

నర్స్ పూలు మారుస్తోంది. వాడిపోయిన పాతపూలని డస్ట్‌బిన్‌లో పారేసి క్రొత్త మెట్ట తామరలని అమరుస్తోంది.

"జీవితంకూడా అంతేగా" అన్నాడు హనుమంతరావు.

నర్స్‌కి ఈ తరహా సంభాషణ అలవాటు కాబట్టి, సమాధానం అనవసరం అనుకుని మౌనంగా ఉండిపోయింది.

"అబ్బ! ఎంత బావున్నాయో ఆ పూలు, పచ్చటి రేకలమీద ఆ ఎర్ర చుక్కలు పెట్టాలని దేముడికి ఎలా తట్టిందో?"

నవ్వేసింది నర్స్. అంతకు ముందో రోజు రాత్రి హనుమంతరావు గది బజర్ వినిపించి, హడావిడిగా వచ్చింది. ఏం జరిగి వుంటుందోనని భయపడుతూ. తను రాగానే కిటికీలోంచి బయటకి చూస్తూ అడిగాడు సీరియస్‌గా.

"నర్స్. దీనికి జవాబు చెప్పు. దేముడు నక్షత్రాలనన్నిటినీ దేనికి తెల్లగానే చేసాడు? పువ్వుల్లా వాటిని కూడా రంగుల్లో సృష్టిస్తే, అలా ఆకాశంలోకి చూస్తూ గడిపేయచ్చుకదా?"

"ఇదడగడానికేనా పిలిచారు?"

"అవును."

"దేముడికి తెలియక."

"నిజమే. తెలియదు. తెలిస్తే ఆరోగ్యంతోపాటు అనారోగ్యం ఎందుకు ఆయన ఆలోచనలోకి వచ్చి ఉంటుంది? కదూ?"

నర్స్ వెళ్ళిపోయింది, పూలు మార్చి.

మధ్యాహ్నం రెండుగంటలకి ప్రక్కగదిలోంచి మందంగా నలుగురయిదుగురి ఏడుపు వినబడింది హనుమంతరావుకి. తనకన్నా ఓ రోజు ముందు చేరిన ఆ గదిలోని రోగికి కూడా, తనలానే రెండవ పూపిరితిత్తి

కూడా చాలా భాగం పనికిరాకుండా పోయిందన్న సంగతి గుర్తు తెచ్చుకున్నాడు హనుమంతరావు.

ఓసారి తనకి కనపడని జలపాతం చూడాలని ప్రయత్నం చేసాడు కళ్ళు మూసుకుని, తన స్మృతిపథంతో.

o o o

హోరు దగ్గరవుతోంది.

హనుమంతరావు ఉత్సాహం మరింత, మరింతగా ఇనుమడిస్తోంది. ఆయాసం కూడా. రాళ్ళని చెట్లని పట్టుకుని నడుస్తున్నాడు. అయిదారడుగులు వేసి పావుగంటయినా విశ్రాంతి తీసుకుంటున్నాడు.

అప్పటికే గంటన్నరనుంచి నడుస్తున్నాడు, శానిటోరియంలోంచి బయటకి వచ్చాడు ఎవరికంటా పడకుండా. దూరంగా ఉన్న ఆ కొండవైపు నడక సాగించాడు వెంటనే, బారుగా పెరిగిన చెట్లమధ్యనుంచి.

కాళ్ళకి గలగల ప్రవహించే సెలయేటి నీటిపాయ తగిలింది. హోరు మరింత ఎక్కువయింది. విచిత్రంగా, అంతా ఎంతో చిత్రంగా ఉంది హనుమంతరావుకి. అంతవరకు తను ఎన్నడూ చూడని రంగురంగుల పిట్టలు రాళ్ళమీద తీరికగా కూర్చుని ఉన్నాయి. కొండ దగ్గరవుతున్న కొద్దీ, ఒక రాయిమీద మరొక రాయి పేర్చినట్లుగ అక్కడక్కడ కొండరాళ్ళు. ఆకుపచ్చ రంగు తివాసిమీద పారేసిన పగడాలలాగ, పచ్చగడ్డిమీద పడివున్న గురువిందలు.

హనుమంతరావు తన వంట్లోని శక్తినంతా కూడతీసుకుని ఓ రాయి దగ్గరికి వెళ్ళి, దానికి ఆనుకుని కూలబడ్డాడు దగ్గుతూ. దాదాపు ఇరవై నిముషాలదాకా ఆ దగ్గు తెరనుంచి విమోచనం కలగలేదు.

తర్వాత చూసుకుంటే ఒళ్ళో ఎర్రటి తడి. గాలి పీల్చుకుని వదల

డానికి ఇబ్బంది. ఆయాసం. నీరసం. గుండెల్లో దడ. ఊపిరితిత్తులనిండా తేళ్ళు చేరి కుడుతున్న భావన. బాధ.

ఎదురుగా చూసాడు హనుమంతరావు. గంభీరంగా, హుందాగా, సాయంత్రం ఎండకి మెరుస్తూ, తనకి ఎవరితోనూ సంబంధంలేనట్లుగ, ఆరు వందల అడుగుల ఎత్తునుంచి పడుతోంది జలపాతం నాలుగడుగుల పరిధితో, ఎడతెగని ధారగా. ప్రక్కనే మరికొన్ని సన్నటి పిల్లధారలు తోడుగా.

ధార కొండక్రింద ఉన్న ఎత్తయిన రాతిమీద పడుతోంది. పడి కింద వున్న సెలయేటితో కలిసిపోతోంది క్రింద పడ్డంత గంభీరంగానూ.

సెలయేటి ప్రక్కన గాలికి తలలాడిస్తూ నిల్చుని ఉన్నాయి రంగు రంగుల పూల మొక్కలు. వాటిమీద తిరిగే సీతాకోక చిలుకలు మరింత సుందరంగా ఉన్నాయి. పూర్తిగా వికసించిన సంపెంగలు సువాసనలు వెద జల్లుతున్నాయి.

హనుమంతరావు అలాగే జలపాతం వంక, ఆ పూలచెట్లవంక, పచ్చికమీద గురివింద గింజలవంక, పక్షులవంకా తన్మయత్వంగా చూస్తూ కూర్చుండిపోయాడు ఆ కొండ రాతికి ఆనుకుని.

నీళ్ళు అంత ఎత్తునుంచి పడి కొండ రాతిని తాకడంవల్ల జనించే ధ్వనితరంగాలని వింటూ, హనుమంతరావు అలాగే చేరగిలబడి చూస్తూండి పోయాడు. ప్రపంచంలో ఇలాంటి సుందర దృశ్యాలు ఇంకా ఎన్ని వున్నాయో? తన ఏభై అయిదేళ్ళజీవితాన్ని ఎంతగా వృధాచేసాడు ఇన్నాళ్ళు?

"డాక్టర్ అన్నారు రెండు మూడు రోజుల తర్వాత మీరు బ్రతకరని ఈ లోపలే డాక్టర్‌తో చెప్పి ఆ జలపాతం దగ్గరకి వెళ్ళండి."

రెండురోజులక్రితం బాలు తనతో రహస్యంగా చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి హనుమంతరావుకి ఆ క్షణంలో. వెంటనే మళ్ళీ దగ్గుతెర

కూడా వచ్చింది. సుడిగాలిలా చుట్టుకుంది గుండెల్లో. చేత్తో ఛాతీమీద రాసుకుంటూ హనుమంతరావు గిలగిలాడిపోయాడు.

'అయిపోయింది. ఇకపర్వాలేదు అయినా చూసేసాగా' అనుకున్నాడు.

మూసుకుపోతున్న కళ్ళని ఎంతో ప్రయత్నంమీద తెరచే వుంచి, ఆ ఆఖరి క్షణాలలో కూడా జలపాతాన్ని చూద్దామనుకున్నాడు హనుమంతరావు.

కొద్దినిముషాలలోనే హనుమంతరావు కళ్ళు మూసుకుపోయాయి.

o o o

"ఇంపాజిబుల్"

"ఇన్ క్రెడిబుల్."

"పిచ్చెక్కి ఉంటుంది. ఇలాంటి ఆఖరిరోజుల్లో మైలుదూరం నడిచి ఎందుకు వెళ్ళినట్లు? జలపాతాన్ని చూడ్డానికంటె నమ్మలేన్నేను."

"నరకయాతన పడివుంటాడు అక్కడికి చేరుకునే లోపల."

శానిటోరియంలో డాక్టర్స్ ఇద్దరు మాట్లాడుకుంటున్నారు హనుమంతరావు గురించి.

"పిచ్చెక్కలేదు. చూడాలనిపించి వెళ్లాను" హనుమంతరావు పెదాలు విప్పి చెప్పలేకపోయాడు. శక్తి లేకపోయింది. ఇంజెక్షన్లు తీసుకుని విసిగి వేసారిపోయిన హనుమంతరావుని శానిటోరియానికి చేర్చాక, దాదాపు పాతిక ఇంజెక్షన్లదాకా ఇచ్చారు.

"ఇక నేను చచ్చిపోయినా పర్వాలేదు. నా ఆఖరి కోరిక తీరింది" అని చెప్పాలనుకున్నాడు కాని మాట్లాడలేకపోయాడు, శానిటోరియం చేరుస్తూంటే హనుమంతరావు.

"రేపు ఈ బెడ్ తప్పక ఖాళీ అవుతుంది." తనని పరీక్షచేసిన స్పెషలిస్ట్ మాటలు గుచ్చుకున్నాయి హనుమంతరావు మనసులో.

"రోగిని కదల్చకుండా...."

"సేఫ్ బెట్. ఇరవై నాలుగుగంటలుగడవడం నెక్స్టుటు ఇంపాసిబిలిటీ."

దూరమవుతున్న బూట్లు.

హనుమంతరావు చుట్టూ ఇద్దరు నర్స్‌లు, డాక్టర్లు చేరి శ్రద్ధగా ఏవేవో ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నారు. ఇక లాభంలేదనీ, హనుమంతరావు ఆఖరి గంటలు దగ్గరకి వచ్చాయనీ తెలిసిపోయింది ఆ నలుగురికీ. అసలంతదాకా బ్రతకటమే ఆశ్చర్యం.

వంతుల ప్రకారం ఒకళ్ళతర్వాత ఒకరు రోగిదగ్గరే ఉండాలని ఆదేశం వచ్చింది పెద్దడాక్టరు దగ్గరనుంచి. హనుమంతరావుకి అర్థమయింది.

o o o

"సార్."

సన్నటి పిలుపు హనుమంతరావు చెవుల్లో పడింది. ఒంటిమీద చేతి స్పర్శ వల్ల మెలకువ వచ్చింది.

"బాలూ. నువ్వా? తెచ్చావా గ్రుడ్లు?" అడిగాడు నీరసంగా.

తలవూపి చెప్పాడు.

"ఇవాళ మిమ్మల్ని ఇంకా నర్స్ లేపలేదే?"

హనుమంతరావుకి గుర్తుకు వచ్చింది డాక్టర్ చెప్పిన ఇరవై నాలుగ్గంటల పరిమితిలో అప్పటికే తొమ్మిది గంటలు గడిచిపోయాయని.

జలపాతం.

"వెళ్ళు. నా కళ్ళకనబడక" కూడబలుక్కుంటున్నట్లుగా చెప్పాడు హనుమంతరావు కర్కశంగా.

బాలూ తెల్లబోతూ చూసాడు.

"విన్నే. బయటకి పో."

"మీకు ఎక్కువయిందని చెప్తే చూద్దామని వచ్చాను. మీరు జలపాతం దగ్గరకి వెళ్ళారని చెప్పింది నర్స్. ఎలా వుందో అడుగుదామని వచ్చాను." బిక్క మొహం వేసుకుని మంచం ప్రక్కనుంచి దూరంగా జరిగాడు బాలు.

"రేపుంటను. ఇది ఖాళీ అవుతుంది."

చిన్నగా వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టాడు బాలు.

"బయటకెళ్ళి తీరిగ్గా ఏడు" కసిరాడు హనుమంతరావు. బయటకి పరిగెత్తాడు బాలు.

లేద్దామని ప్రయత్నించాడు కాని లేవలేకపోయాడు. తలతిప్పి కిటికీ లోంచి కిరీటంలా కనబడే ఆ పచ్చటి కొండ వంక చూసాడు. తృప్తిగా, గర్వంగా, సంతోషంగా కొద్దిగా బాధగా కూడా చూసాడు.

అయిదారు నిముషాలు గడిచాయి. బాలూ వచ్చాడు మళ్ళీ లోపలికి.

"ఏంవచ్చావ్?" కోపంగాఅడిగాడు హనుమంతరావు దగ్గుతెరమధ్య.

"ఏంలేదు" వాడి కళ్ళలో భయం.

ఇరవై సంవత్సరాల తర్వాత తనుండడు. కాని వీడుంటాడు. అప్పుడు ఈ ప్రకృతంతా వీడిదే.

"పో బయటకి అయితే!"

"జలపాతం ఎలా ఉంది? నే చెప్పినంత బావుళ్ళా?"

"ఇక నా కళ్ళబడక. బయటకెళ్ళు." హనుమంతరావు కళ్ళు నిప్పులు కురిపించాయి బాలుమీద.

"ఆ కొండ వెనకాలే మా పల్లె ఉంది. ఎంత బావుంటుందను కున్నారు ఆ కొండ వెనుక? పెద్ద సరస్సు. సరస్సులో అక్కడక్కడ ఉన్న కొండ రాళ్ళమీద పిట్టలు. అవి భలే పాడతాయి ఎప్పుడూ...."

చెప్పుకుంటూ పోతూ, గది దాటుతున్న బాలూకి వినబడింది హనుమంతరావు పిలుపు.

"ఆగు."

ఆగాడు.

"మాట."

"ఏం మాట?" అడిగాడు దగ్గరికి వెళ్ళి.

"పాడే పిట్టలు. ఇంకా?" అడిగాడు హనుమంతరావు ఆసక్తిగా.

"బోలెడు ఎర్ర తామరలు. నీళ్ళలో తిరుగుతూ కనబడుతుంటాయి రంగు రంగుల చేపలు. దాంట్లో మీలాంటి వాళ్ళు తిరిగేందుకో చిన్నబోటు. నేనయితే ఎప్పుడూ అందులోనే ఈదుతాను. ఆ సరస్సు చుట్టూ మెట్టతామర పూలతోట. ఇంకా...."

మరో అరగంటదాకా బాలూ కదలలేదు హనుమంతరావు దగ్గరనుంచి.

బాలూ వెళ్ళాక నర్స్ వచ్చింది. హనుమంతరావు ఆ కొండవైపు చూస్తూ కూర్చోవటం గమనించింది. నర్స్ తన పని చేసుకుని బయటకి వచ్చేసింది కాని, హనుమంతరావు నర్స్ ఉనికిని గుర్తించనట్లుగా దీక్షగా, కొద్దిగా ఆశగా కిటికీలోంచి ఆ కొండవైపే చూస్తూ కూర్చున్నాడు.

చివరి అంచులో మరో మొలక!

మర్నాడు స్పెషలిస్టు విపరీతంగా ఆశ్చర్యపోయాడు, హ
రావు తను అనుకున్న విధంగా మరణించక పోవడంవల్ల.

అంతే కాదు.

ఆ మర్నాడు కూడా హనుమంతరావు మరణించలేదు.

(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక

46
SREE HARI BOOK
మావద్ద ప్రముఖ రచయితల
డిటెక్టివ్ లు బాడుగకు లభి
రోజుకు బాడుగ : 0.5